శుభలేఖతో పచ్చని మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వారు ఇద్దరూ ఫిజియోథెరపిస్టులు. వివాహ నిశ్చితార్థం నుంచి వారికి ఒక కొత్త ఆలోచన వచ్చింది. వివిధ రీతుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన వారిది. దీంతో నిశ్చితార్థం రోజు నుండి వంద రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వీరి సేవలను కలెక్టర్, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. ర్యాలికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలకుడు శ్యామ్ జాదూగార్ తనయుడు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్‌తో బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సాయి సీతతో వివాహం కుదిరింది. వీరి వివాహానికి పెళ్లి కార్డుతో పాటు మొక్కల ప్రాధాన్యత తెలిసేలా అందరికీ ఒక మొక్కను బహూకరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉద్యోగ భద్రతపై బెంగ

- ఇన్సూరెన్స్ విధానంలోకి ఎన్‌టిఆర్ వైద్య సేవ?
- భవిష్యత్‌పై సిబ్బందిలో ఆందోళన
- అమలు కాని కనీస వేతనాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సామాన్య రోగులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో తమ వంతు కృషి చేస్తున్న వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రత బెంగ పట్టుకుంది. గత 17 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ వ్యవస్థను నమ్ముకుని విధులు నిర్వర్తిస్తున్న మిత్రాల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) స్థానంలో ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎంత మందిని ఉద్యోగాల్లో ఉంచుతారు. ఎంతమందిని తొలగిస్తారనేది స్పష్టత లేదు. దీంతో ఉద్యోగ భద్రతపై వైద్య మిత్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 210 మంది వైద్య మిత్రలు, 20 టీమ్ లీడర్లు పని చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ప్రయివేట్, ప్రభుత్వ అనుబంధ ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రలు 17 ఏళ్ళుగా పని చేస్తున్నారు. డిగ్రీ అర్హతతో ఆహ్వానించిన దరఖాస్తుల మేరకు జిల్లాల్లో రాత పరీక్ష రాసి జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు చేస్తున్నారు. అనుబంధ ఆసుపత్రుల యాజమాన్యాలు, రోగులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం మధ్య అనుసంధానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి వెంటాడుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసివేసి ఆరోగ్య బీమాను తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఇప్పటికే చర్చలు జరిపింది. ఓ బీమా కంపెనీతో సైతం ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నూతన విధానాన్ని అమలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కనీస వేతనాలను అమలు చేయాలని కోరుకున్నారు.

అరకొర వేతనాలే

గత వైసిపి ప్రభుత్వం వైద్యమిత్రాలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదు. దీంతో అరకొర వేతనాలతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుంది. మరోవైపు సంక్షేమ పథకాలకు కోత పెట్టారు. బండెడు చాకిరీ చేస్తున్నా కనీస వేతనాలు అందరి పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలు క్రమబద్ధీకరణ కాక వేతనాలు సరిపోక అటు సంక్షేమ పథకాలూ అందక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అధికారులకు పదేపదే వినతి పత్రాలు అందచేస్తున్నా పట్టించుకోని దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నెలకు రూ.15వేలు మాత్రమే వేతనం వస్తుంది. ఆరోగ్య మిత్రలను ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతున్నారు. దీనివల్ల వీరికి అమ్మఒడి కింద ఆర్థిక సాయం, పెన్షన్, ఆరోగ్యశ్రీ వంటి ఉచితంగా చికిత్స పొందే అవకాశాన్ని కోల్పోయారు. తెల్లరేషన్‌కార్డును కూడా జారీ చేయడం లేదు. ఇతర ఉద్యోగాల భర్తీలో ఆరోగ్యమిత్రలుగా పనిచేసే వారికి ప్రాధాన్యం కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం గుర్తించిన ఉద్యోగ కేటగిరిల జాబితాలో లేనేలేదు. దీనివల్ల వీరికి అసలు ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. డిగ్రీ అర్హత కలిగినప్పటికీ పొరుగుసేవల కింద పని చేస్తున్నారు. ఎటువంటి క్యాడర్ లోనూ లేరు. 3వ తరగతి ఉద్యోగులుగా మాత్రమే చూపుతున్నారు. అటెండర్ క్యాడర్ కూడా కాదు. క్లర్క్‌గా ఉన్న క్యాడర్ 1గా గుర్తింపు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆరోగ్యమిత్ర హోదాకు తగ్గ కేటగిరి సృష్టించాలని, హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి...

ఉద్యోగ భద్రత కనీస వేతనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నెల 10, 17, 24వ తేదీల్లో (మూడు సోమవారాలు) విధులు బహిష్కరించేందుకు నోటీసులు ఇచ్చాము. కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మరోవైపు ఆప్కాస్ రద్దు దిశగా ఆలోచనలు చేస్తున్నట్లుగా మాకు సమాచారం అందింది. అయితే సమ్మె వద్దని ఈ నెల 12న చర్చలకు రమ్మన్నారు. చర్చలు సారాంశాన్ని బట్టి వచ్చే సోమవారం అనుకున్న విధంగా విధులను బహిష్కరిస్తాం. దశల వారీగా ఆందోళనలు చేపడతాం.

- వంచర్ల వీరభద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఎపి వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్

ఏ సౌకర్యాలూ లేవు...

17 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నాం. అయితే ఇప్పుడు ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేస్తే ఆప్కోస్‌ను రద్దు చేస్తారని ప్రచారం జరుగుతుంది. ఇంకో కొత్త ఏజెన్సీలకు ఇస్తే అనుభవం పోతుంది. కావున ఆప్కోస్‌ను రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి. ఇన్సెంటివ్‌ను 2 శాతం ఇవ్వాలి. ఇంక్రిమెంట్లు అందించడంతో బాటు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి.

- పాలెపు శివ, వైద్య మిత్ర, గౌరవ సలహాదారుడు

ఏళ్ల తరబడి పని చేస్తున్నా గుర్తుంపు లేదు

అనేకేళ్లుగా ఆరోగ్యశ్రీ ట్రస్టులో పనిచేస్తున్న మాకు ఎటువంటి గుర్తింపు లేదు. కనీస వేతనాలు అమలు కావడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచాలి. బీమా సేవలను తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నారు. మాకు ఉద్యోగ భద్రతను కల్పించాలి.

- వల్లూరి బంగారుశ్రీ , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్

కలెక్టరేట్‌లో సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

మైగ్రేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

విదేశాలకు వలస వెళ్లి తమ కుటుంబాలను పోషించుకోదలచిన వారికి అన్ని విధాలా సౌకర్యవంతమైన చట్టబద్ధంగా మార్గ నిర్దేశం చేసేందుకు స్థానిక కలెక్టరేట్లో విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్ (కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్‌ను ఆయన ఎస్‌పి బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్‌ఒ బిఎల్ఎన్. రాజకుమారి, ఆర్‌డిఒలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి విదేశాలకు వలస వెళ్లి జీవనోపాధి పొందాలనుకునేవారికి అన్ని విధాలా చట్టబద్ధంగా విదేశాల్లో ఉన్న అవకాశాలు పాస్‌పోర్టు వీసాలు పొందేందుకు గల మార్గాలను సూచించడంతోపాటు అన్ని విధాలా గైడెన్స్ ఇస్తూ ఎటువంటి మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉద్యోగావకాశాలు పొందేందుకు ఈ కేంద్రం ఒక వరంగా నిలుస్తోందన్నారు. విదేశాలకు వెళ్లదలిచిన వారు విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చిన వారు మరల తిరిగి వెళ్లేందుకు ఈ కేంద్రం తగిన చట్టబద్ధత కలిగిన సహకారాన్ని సలహాలను అందిస్తుందన్నారు. గతంలో ఏజెంట్లు సంస్థల తరపున విదేశాలకు వెళ్లి ముందుగా సూచించిన ఉద్యోగం కాక వెట్టిచాకిరీ పనులకు నియమించడం చేసేవారని, విజిటింగ్ వీసాలతో పంపుతూ పలు మోసాలకు పాల్పడే వారని, దీంతో ఈ కేంద్రాన్ని స్థానికంగా ఆరుగురు సిబ్బందితో పూర్తి సమాచారాన్ని మద్దతు అందించే విధంగా నెలకొల్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ నోడల్ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి, సమన్వయకర్త గోళ్ల రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-రావులపాలెం

మండల పరిధిలోని ఊబలంకలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి న్యాయం చేయాలంటూ హైవేపై మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామానికి చెందిన వందే విజయ కుమారి(45) సోమవారం రోడ్డు ప్రమాదంలో టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రావులపాలెం పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో సిఐ శేఖర్ బాబు ఆందోళనకారులతో చర్చించి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

రంగు మారిన తాగునీరు

రంగు మారిన తాగునీరు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కొంతకాలంగా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో సరఫరా అవుతున్న మంచినీరు రంగు మారి దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలు విపరీతంగా పెరిగాయి. గతంలోనూ తాగునీటిపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. వెల్ల గ్రామం నుంచి సరఫరా అవుతున్న వాటర్ ప్లాంట్ గురించి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రంగు మారిన ఈ తాగునీటిని తాగితే ప్రజలకు వాంతులు విరోచనాలు టైఫాయిడ్స్ కామెర్లు, వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, వెంటనే దీని గురించి మున్సిపల్ కమిషనర్ స్పందించి తాగునీటి నాణ్యతపై చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజల కోరుతున్నారు. రంగు మారిన తాగునీటి విషయమై అంబేద్కర్ కోనసీమ జిల్లా సాధికార కమిటీ డైరెక్టర్ డాక్టర్ కలిదిండి సూరిబాబు మాట్లాడుతూ తాగునీటి విషయమై మున్సిపల్ అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అధికారులపైన ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని వివరించారు. మున్సిపల్ అధికారులు తాగునీటిలో లోపాలను పరిష్కరించి స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదంపై నడిపూడి గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

ఒక భూవివాదంలో ఘర్షణ తలత్తే విధంగా, తన సామాజికవర్గానికి వత్తాసు పలుకుతున్న అమలాపురం తహశీల్దార్‌పై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నడిపూడి గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అమలాపురం రూరల్ మండలం నడిపూడిలో సూర్యచంద్ర దళితసేన, శ్రీకనకదుర్గమ్మ ఆలయ కమిటీకి 20 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ముంజవరపు సత్యనారాయణ మూడు సెంట్ల స్థలాన్ని దసరా ఉత్సవాలు చేసుకునేందుకు ఇచ్చారని తెలిపారు. ఆ భూమి ప్రక్కనే 40 సెంట్లు గ్రామకంతం భూమిని గన్నవరం విఆర్‌ఒగా పని చేస్తున్న మందా లక్ష్మన్‌రావు ఆక్రమించుకున్నట్టు తెలిపారు. ఆలయ కమిటీకి దాత ఇచ్చిన భూమి కూడా తనకు చెందుతుందని అనేకసార్లు ఆలయ కమిటీ మీద ఘర్షణలకు దిగుతూ తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో విచారణ నిమిత్తం మంగళవారం అమలాపురం తహశీల్దారు ఇరు వర్గాలనూ భూమి వద్దకు రావాలని చెప్పి తహశీల్దార్ ఏకపక్షంగా మాట్లాడుతూ లక్ష్మణ్ రావుకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచిన తహశీల్దార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, విఆర్‌ఒ మంద లక్ష్మణరావుపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలమూరు మోహన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బుడితి దయ మహేష్, కుంచే రమేష్, గ్రామస్తులు గోసంగి శ్రీనివాసరావు, గుమ్మళ్ల శ్రీను, కొండేపూడి రవి, కొండేపూడి రాజు, దుక్కిపాటి వెంకటరమణ, ములపర్తి వెంకటేశ్వరరావు, నీతిపూడి దుర్గాప్రసాద్, జంగా సుమతి, నాగాబత్తుల భారతి, ములపర్తి కనకదుర్గ, మంగ, గోసంగి నరేంద్ర పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నడిపూడి గ్రామస్తులు

అభివృద్ధి పనులపై మంత్రికి ఎంఎల్‌సిల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం-రావులపాలెం జాతీయ రహదారి పనులు చేపట్టాలని, అమలాపురం పట్టణంలో ఎర్రవంతెన, నల్ల వంతెన ఈదరపల్లి వంతెనలను ఆధునికీకరించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎపి రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్థన్ రెడ్డిని కోరారు. ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కెఎస్.లక్ష్మణరావు, బొర్రా గోపిమూర్తి శాసనమండలిలో మంత్రిని ఈ మేరకు కోరారు. అమలాపురం-రావులపాలెం జాతీయ రహదారిని వేయడానికి ప్రతిపాదన ఏదైనా ఉందా, భూసేకరణ ప్రక్రియ పనులు ఏ దశలో ఉన్నాయి, ఏదైనా నిధులను కేటాయించారా, వాటికి గల వివరాలు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ భూసేకరణ జాయింట్ కలెక్టర్‌ను నియమించామని, రూ.766.19 కోట్ల అంచనా వ్యయంతో పాటు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను ఫిబ్రవరి 24న న్యూఢిల్లీలోని ఎంఒఆర్ అండ్ హెచ్‌కు సమర్పించామని తెలిపారు.

సర్క్యులేషన్ ప్యాట్రన్‌పై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు రూపొందించిన సర్క్యులేషన్ ప్యాట్రన్‌పై సలహాలు, సూచనలు, వినతులు స్వీకరిస్తున్నట్టు నగర పంచాయతీ కమీషనర్ రవివర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 5, 6, 18 వార్డుల్లోని బళ్లగేటు సెంటర్, హాస్పిటల్ రోడ్, గొల్లలవీధి, 5 వార్డు పరిధిలోని బాలయోగి కాలువ రోడ్, యాదవ వీధి, కుమ్మర్ల వీధి, గొల్లల వీధి ప్రాంతాల్లో డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ప్రణాళికను నగర పంచాయతీ కార్యాలయం, వార్డు సచివాలయ కార్యాలయం నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. నగర వాసులు వీటిని పరిశీలించి తగు సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే సచివాలయంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ, లేదా పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారిని స్వయంగా కలిసి సూచనలు, సలహాలు లేదా అభ్యంతరాలు తెలపవచ్చన్నారు.

సృజనాత్మక విద్యను పెంపొందించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక విద్యను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విధులు నిర్వర్తిస్తున్న డ్రాయింగ్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు మంగళవారం ఎఎంఒ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సమీక్షా సమావేశం ముగింపు సభలో డిఇఒ డాక్టర్ బాషా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా బోధనచేసే విధంగా అంకితభావంతో పనిచేయాలన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. బోధనేతర సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పని చేయడం ద్వారా జిల్లాను విద్యాపరంగా మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఎఎంఒ రాంబాబు, ఫైనాన్స్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం, ఐఇ కోఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సలీం బాషా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థులు మహనీయుల స్ఫూర్తితో కష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చునని మండల షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, సామాగ్రిని సంఘం అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానానికి చిహ్నమైన అంబేద్కర్ స్ఫూర్తితో చదువుకోవాలని, చిన్నతనంలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదివి గమ్యాన్ని చేరుకోవచ్చునని సూచించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాశి వెంకటాచార్య, ఎం.ఆశీర్వాదం, జగ్జీవన్ రామ్, జె.సత్యనారాయణ, నక్కా శ్రీనివాస్, పాము ఆనందరావు, చికిలే తిరుపతి రావు, హాస్టల్ వార్డెన్ మేరీ రత్నం పాల్గొన్నారు.

7 నుంచి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-అమలాపురం

ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోతవాలు ఏప్రిల్ 7వ తేదీ నుండి 13వ తేదీ వరకూ అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉత్సవాల సన్నద్ధతపై దేవాదాయ, పోలీసు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రియల్ 7న సోమవారం ధ్వజారోహణ, 8న మంగళవారం స్వామి వారి తీర్థం, రథోత్సవం కళ్యాణం కార్యక్రమాలు, 9న స్వామి వారి పొన్న వాహన సేవ, 11న గోదావరి నదిలో తెప్ప ఉత్సవం, 12న మహా పూర్ణాహుతి చక్రస్నానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, పోలీసుల పర్యవేక్షణలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, దేవస్థానం ఇఒ చక్రధరరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, తహశీల్దారు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సలీం బాషా

దళిత చైతన్య వేదిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రాజోలు

దళిత చైతన్య వేదిక చేస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు అన్నారు. రాజోలు మండలం కడలి గ్రామంలో మంగళవారం దళిత చైతన్య వేదిక నాయకులు పే బ్యాక్ టు ద సొసైటీ కార్యక్రమాన్ని కడలి ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత దళిత చైతన్య వేదిక నాయకులు స్కూల్ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 53 మంది పదోవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని కడలి గ్రామ సర్పంచ్ చొప్పల గుణనాథ్ అందించారు. దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, దళిత చైతన్య వేదిక నాయకులు చిలకపాటి శ్రీధర్, మందపాటి మధు, మట్టా సురేష్ కుమార్, విప్పర్తి మహేష్, పొన్నమాటి భాస్కర్, తోట సుభాష్ రాయ్, విద్యా కమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఐ.సుధ, డి.శ్రీనివాస్, పి.ధర్మశేఖర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండల కేంద్రమైన ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శాంతా లక్ష్మి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరణ గురించి అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ ఇష్టం వచ్చినట్టు పడవేయకూడదని సూచించారు. గ్రామంలోని వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆశ్రమంలో పిల్లలకు మంచాల అందజేత

ప్రజాశక్తి-మండపేట

ఆశ్రమంలో పిల్లలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, దాతల సహకారంతో ఏలేశ్వరం మండలం పెదశంకర్లపూడిలో బెతెస్త ఆశ్రమంలో పిల్లలకు 20 మంచాలను, నిత్యావసర వస్తువులు అందించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చేరదీసి బేతెస్త ప్రార్థన మందిర నిర్వాహకులు పాస్టర్ కిషోర్ చేస్తున్న నిస్వార్థమైన సేవలకు స్పందించి కళాశాల రికార్డు అసిస్టెంట్ వారా వెంకట రావు కుటుంబం 4 నెలలకు సరిపడా కిరాణా సామగ్రి, విద్యార్థులకు పరీక్ష సామాగ్రి, ఇతర వస్తువులను అందించారని తెలిపారు. కళాశాల విస్తత సేవలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఇకముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్ కుమార్, గోపాలకృష్ణ, మధు కుమార్ అభినయ్, రామకృష్ణ, నరేష్, అనపర్తి గ్రామ సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

750 లీటర్ల డీజిల్ సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

అనుమతులు లేకుండా నిల్వ చేసిన 750లీటర్ల డీజిల్‌ను సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. డిఎస్ఓ ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ గోపాలపురం శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా రసీదులు లేకుండా 750 లీటర్ల డీజిల్, 2610 లీటర్ల బ్లాక్ ఆయిల్ నిల్వలు ఉన్నాయని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వమించామన్నారు. అక్రమ మార్గంలో డీజిల్ సేకరిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఎటువంటి రసీదులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. నిందితునిపై కేసులు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన ఆయిల్‌ను గోపాలపురం పెట్రోల్ బంకు వద్ద భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో సివిల్ సప్లయిస్ డిటి దివాకర్, విఆర్ఒలు పాల్గొన్నారు.

250 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం కడియపులంక గ్రామ శివారులో అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న పిడింగొయ్యికి చెందిన గెడ్డం వేణు, మరో ముగ్గిరిపై కేసు నమోదు చేశారు. 250 లీటర్ల నాటు సారా, ఒక బైకును స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. 5వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఒకరిని అరెస్టు చేశామన్నారు.

సీతానగరంలో..

అచ్చ్యుయ్యపాలెం గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన ఉల్లింకల రామకృష్ణ అనే వ్యక్తి నాటు సారా వ్యాపారం చేస్తుండగా సీతానగరం హెచ్‌సి సత్యనారాయణ, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

మైనార్టీ నాయకుని ఇంటిపై దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామంలో సోమవారం అర్ధరాత్రి నున్న వారి వీధిలో మైనార్టీ నాయకుడు ఎమ్‌డి.జాఫర్ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడికి ప్రయత్నించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కొంతకాలంగా మసీదు వివాదాలు ఏర్పడడంతో జాఫర్‌ను వ్యతిరేకిస్తున్న కొందరు రెండు సీసాల్లో పెట్రోల్ పోసి వాటికి మందుగుండు ఔట్లు కట్టి జాఫర్, ఆయన కుమారుడు అబ్బాస్ నిద్రిస్తున్న రేకుల షెడ్ గోడపై పెట్టి అంటించి వెళ్లిపోయారు. రెండు సీసాల్లో ఒకటి పేలిపోయి గాజు పెంకులతో అబ్బాస్ చేతికి స్వల్ప గాయం అయింది. పెద్ద శబ్దంతో సీసా పేలడంతో పరిసర ప్రాంతాల వాసులు భయాందోళనలకు గురయ్యారు. మహమ్మద్ రోషన్‌తో పాటు మరో ఇద్దరు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు జాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం సిఐ వెంకట నారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువ నుంచి ఎస్.యానాం వెళ్లే పంట కాలువలో చల్లపల్లి వద్ద మంగళవారం గుర్తుతెలియని కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహం గుర్తుపట్టేందుకు వీలు లేకుండా ఉందని ఎస్ఐ, సిహెచ్.రాజేష్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై కేసు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలివి. వడ్లమూరు గ్రామానికి చెందిన కొల్లాటి సురేష్ వద్ద నుంచి 10 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని వేగాయమ్మపేట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజులూరు మండలంలోని అంద్రంగి గ్రామానికి చెందిన కేశన మణికంఠ ద్రాక్షారామం వైపు నుండి వేగాయమ్మ పేట వైపు వస్తుండగా, జగన్నాయకులపాలెం గ్రామానికి చెందిన కేతన సాయి, కేతన కిరణ్ బైకుపై వస్తూ ఒకరికొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కేశన మణికంఠ, కేతని సాయి తీవ్రంగా గాయపడగా 108లో వారిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మండలంలోని సమనస రంగాపురం బాబునగర్‌లో అగ్ని ప్రమాద బాధితులకు మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యమంతుల రజని ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు, వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ మనవతా దక్పథంతో చల్లపల్లి, సింగరాయపాలెం, అనాతవరం సభ్యులు వీటిని సమకూర్చారని తెలిపారు. సభ్యుల సహకారంతో ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దాతలెవరైనా మరింత మంది ఇలా సాయం చేయడానికి ముందుకొస్తే బాధితులకు భరోసా లభిస్తుందని తెలిపారు. తమ వంతుగా సాయం చేయడానికి ముందుకొచ్చిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సుజాత, జంగా తనూజ, అయితాబత్తుల భీమాబాయి, అయితాబత్తుల మంగ, కందేరి మణి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇఒపిఆర్‌డి మోహన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్త ఆయన గ్రామల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి నుంచి చెత్త సేకరించి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివ చక్రవర్తి పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - పి.గన్నవరం

పేద మహిళలు స్వయం ఉపాధికి ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసిందని పి.గన్నవరం ఎంపిడిఒ కెవి.ప్రసాద్ తెలిపారు. స్థానికంగా స్థిర నివాసం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రాలు ఉన్న 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు పేద మహిళలు అర్హులన్నారు. వితంతువులు, వికలాంగ మహిళలకు, అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. శిక్షణలో 70 శాతం హాజరున్నవారికే ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు వినియోగంలో ఉన్న మొబైల్ నెంబర్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో గ్రామ సచివాలయంలో నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనని ఎంపిడిఒ కోరారు.

భజన కళాకారులకు ఘన సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నంలంక బొక్కావారి పాలెం రామాలయం వద్ద సప్తాహ ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ సేవలందించిన భజన కళాకారులను మంగళవారం ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. కంచి నీలకంఠ గురుమూర్తి నాగలక్ష్మి దంపతులచే అర్చకులు గాడేపల్లి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన సప్తాహ ఉత్సవం మంగళవారం ముగిసింది.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-పి.గన్నవరం

పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పి.గన్నవరం ఎంపిడిఒ కెవి.ప్రసాద్ అన్నారు. ముంగండ హైస్కూల్‌లో సర్పంచ్ కుసుమ చంద్రకళ వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముక్కామల సూర్యనారాయణమూర్తి (సూరిబాబు) ఆర్థిక సాయంతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు 10వ తరగతి విద్యార్థులు 81 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అంబటి భూలక్ష్మి, ఎంపిటిసి ముక్కామల భారతి, ఉప సర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య, పంచాయితీ కార్యదర్శి పి.శ్రీనివాస్, హెచ్‌ఎం రమణమూర్తి ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 74 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -ముమ్మిడివరం

ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 74 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్త పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం పరీక్షకు మండలంలోని డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 890 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 816 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 74 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పలువురికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -అల్లవరం

బోడసకుర్రు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం రాజమహేంద్రవరం నేత్రా కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వర రావు, టిడిపి మండల యూత్ అధ్యక్షుడు ముత్యాల బాబి, జనసేన నేత రోళ్ల శ్రీనివాసరావు, రొక్కాల నాగేశ్వర రావు, పొటుపోతు దుర్గారావు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం నిర్వహించిన జాబ్ మేళాలో 27 మంది ఎంపికైనట్టు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి డి.హరిశేషు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 52 మంది హాజరు కాగా వీరిలో 27 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా హరి శేషు మాట్లాడుతూ ఎంపికైన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఇచ్చే శిక్షణ నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ మేళాలో ముమ్మిడివరం స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, డిపిఒ రాజేంద్ర పాల్గొన్నారు.

జిల్లా మలేరియా అధికారిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా మలేరియా అధికారిగా నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొరకు జాయినింగ్ నివేదికను అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనఉమ్మడి తూర్పు గోదావరి ఏజెన్సీ జిల్లా మలేరియా కార్యాలయం, రాజమహేంద్రవరంలో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా పని చేశారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడలో వైసిపి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే యువత పోరు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక గోలి వారి వీధిలోని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ, మండలం నుంచి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, పప్పుల దుర్గ, ఆరేళ్ల వీరరాఘవ, కొట్టి పవన్, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, బొబ్బిలి హరిబాబు, గుర్రాల యాకోబు, చింతా శ్రీనివాస్, తాటికొండ పెదకాపు, గొల్ల పెద్ద, వైసిపి యూత్ పట్టణ ప్రెసిడెంట్ కురందాసు సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ అభివృద్ధిని వైసిపి నాయకులు అడ్డుకుం టున్నారని 13వ డివిజన్ టిడిపి అధ్యక్షులు కాళ్ళ రవీంద్ర అన్నారు. 13వ వార్డులో సిసి రోడ్డును కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై మంగలవారం ఆయన కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. వార్డులో జరిగిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. వార్డులో జరిగిన అభివృద్ధిని వక్రీకరిస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నట్టు చెప్పారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-అయినవిల్లి

మహిళల కలలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని పలువురు అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. దీపం పథకం ద్వారా ఇప్పటికే 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని, వచ్చే నెలలో తల్లికి వందనం, ఉచిత బస్ ప్రయాణం పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దాల సుబ్రహ్మణ్యం, సలాది నాయుడు, బిక్కిన బాబీ, కుడుపూడి బుజ్జి, కోడూరి రఘు, వస్కా శ్యామ్, కుమ్మరి మాధవి వెంకటరమణ, మధుర రమేష్, గెడ్డం రమేష్, పులిదిండి సురేంద్ర, ఇసుకపట్ల బాబ్జి పాల్గొన్నారు.

ఇంద్రశేఖర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట

వైసిపి మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఇంద్రశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, కె.కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్, ఎంపిటిసి సమాఖ్య ఎం.ప్రశాంత్, పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

శ్రామిక భవనాన్ని తీర్చిదిద్దుతాం : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రామిక భవనాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. క్వారీ మార్కెట్ జంక్షను వద్ద గల డంపింగ్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న శ్రామిక భవనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి అంచనాతో దీన్ని నిర్మిస్తున్నామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కింది, మొదటి, రెండవ అంతస్తుల్లో సమావేశాలు, వర్కు షాపులు నిర్వహించుకొనేలా దీన్ని నిర్మిస్తున్నామన్నారు. శుభకార్యాల నిర్వహణకూ అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం కుక్కల బర్త్ కంట్రోల్ ఆపరేషన్ థియేటర్‌ను ఆయన సందర్శించారు. ఆపరేషను జరిగిన తరువాత కుక్కలను ఉంచడానికి 25 కెన్నెల్స్, 6 గ్రూప్ కెన్నెల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. 12 కుక్కలను ఉంచేలా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. 50 కెన్నెల్స్‌తో కొత్త భవనాన్ని, ఆపరేషన్ థియేటర్‌ను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ 30 కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నిడదవోలు మున్సిపాలిటీ వారు పట్టుకున్న కుక్కలకూ ఇక్కడే ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఆయన వెంట ఇఇ మదర్షా ఆలీ, ఎఇ పి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రవేశాలకు ప్రచారం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

ఉంగ్రాజవరం, ఉన్నత పాఠశాల ప్లస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో అడ్మిషన్లు పొందాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మోర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గతేడాది పరీక్షల్లో కళాశాల సాధించిన ఫలితాలతో కూడిన కరపత్రాలను పంచారు. అలాగే విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి ప్రచారం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. పద్మజారాణి, జి.మహేష్‌కుమార్, ఉదయభాస్కర్, డి.శీనివాస్ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని యువసేన బ్లడ్ బ్యాంక్‌లో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జె.నరసింహనాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఛార్జీల వివరాలపై ఆరా తీశారు. పేషెంట్ రిక్విజేషన్ ఫామ్ తీసుకుని ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. పేషంట్ పేమెంట్ రిసిప్ట్ ఇష్యూ రిజిస్టర్స్ అన్ని సక్రమంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

హక్కులపై అవగాహన

గండేపల్లి : సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థల డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మేధో సంపత్తి హక్కుల ఆధ్వార్యాన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జెడి సిహెచ్.గణపతి పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో కెరీర్ డెవలప్మెంట్ డీన్ ప్రొఫెసర్ జెడి వెంకటేష్, ఐపిఎఫ్‌సి కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణకు కృషి

తాళ్లరేవు : సముద్ర తీరం వెంబడి సామూహికంగా మరణిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలని వైల్డ్ కెనాఫీ హాబిటాట్స్ ఓషన్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సంగాడి ధర్మారావు కోరారు. మంగళవారం జెసి రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. ఆ వివరాలను తాళ్లరేవులో ఆయన మీడియాకు వెల్లడించారు. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు భారీ సంఖ్యలో మరణిస్తున్నాయని అన్నారు.

మహారాజశ్రీ 5వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 860/2021

Between:
Kilaparthi Adhilakshmi ...*Plaintiff*
AND
1) Pacchimalla Venkata Rao, S/o. late Venkanna, Hindu, aged 60 years, D.No. 52-9-5, Masidu back side, Near 16 taps Street, Rajendra Nagar, Rajamahendravaram, E.G.Dt.,
2) Pacchimalla Simdhiya Rani ...*Defendants 1 & 2*

పై నంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమను/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పివేయుచున్నారు. కావున **ది. 09-04-2025 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.సత్యనారాయణ
రాజమండ్రి అడ్వకేటు, రాజమండ్రి
11-3-2025 సెల్: 90106 56529

మహారాజశ్రీ 1వ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 671/2022

Between:
Sorlam Kaveri and Another ...*Petitioners*
AND
Bathina Subhash @ Subbayya and Others ...*Respondents*
R-4: Naga Veera Venkata Durga Prasad, S/o. Srinivasa Rao, Rampa Yerrampalem Village o Gokavaram Mandal.
...*Proposed party/ 4th Respondent*

పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 04-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.సీతారామయ్య
రాజమండ్రి బి.లక్ష్మీనారాయణ
11-3-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

దావా నోటీసు
మహారాజశ్రీ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు

O.S.No.52/2023

Between:
మారిశెట్టి శ్రీనివాసరావు -వాది
మరియు
మల్లుల్లి రాధాకృష్ణ -ప్రతివాది
మల్లుల్లి రాధాకృష్ణ, S/O. ఆదినారాయణ, హిందు, వయస్సు 65 సం॥రంలు, వ్యాపారం, డోర్ నెం. 11-48, గొల్లల మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, కాకినాడ JCJC.

పై దావా నందు ప్రతివాది అయిన మీ నుండి తనకు రావలసిన ప్రామిసరీ నోటు బాకీ మింజువలె అసలు, వడ్డీ మరియు ఖర్చులతో సహ మీ నుండి ఇప్పించుమని పై శ్రీ కోర్టువారిని కోరుచూ వాది పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలోగాని శ్రీ కోర్టువారు దావా నోటీసులు ఎన్నిమార్లు మీకు పంపించినప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచుండుటచే శ్రీకోర్టువారు ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా సదరు పై దావా వాయిదా తెలియజేయమని ఆర్డరు వేసియున్నారు. కావున పై దావా నందు ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది.18-03-2025వ తేదీకి పై శ్రీ కోర్టువారినందు వాయిదావున్నది. అని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. కావున మీరు సదరు వాయిదా రోజు అయిన **ది.18-03-2025వ తేదీన ఉదయం 10.30 గం॥ ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారాగాని పై శ్రీకోర్టువారి యెదుట ఎదుటహాజరై మీకు ఏమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టువారికి తెలియజేసుకొనవలసినదిగా తెలియ జేయడమైనది. లేకున్నచో మీ పరోక్షమున శ్రీకోర్టువారు తీర్మానింతురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ననుసరించి)
శ్రీ మేడపాటి రవి షణ్ముఖ రెడ్డి
అనపర్తి, శ్రీ గొలుగూరి బుల్లి రెడ్డి
ది. 11-03-2025 అడ్వకేట్స్, అనపర్తి

జనసేన ఆవిర్భావ దినోత్సవంపై ప్రచారం

ఈ నెల 14న పిఠాపురం చిత్రాడలో జరిగే ఆ పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం పలుచోట్ల ప్రచార కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉప్పలగుప్తం జనసేన పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు దుగ్గిశెట్టి సంజయ్‌బాబు మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో జనసేన పార్టీ నాయకులను ప్రజలను కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, యాళ్ల నాగ సతీష్, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణ మూర్తి, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, చిక్కం సూర్య మోహన్, ఆకుల బుజ్జి, సాకా రాంబాబు, వాకపల్లి సత్యనారాయణ, సుంకర అబ్బాయి, దంగేటి బాబులు, పెమ్మాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు సుంకర కృష్ణవేణి పినపళ్లలో సర్పంచ్, ఉమ్మడి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సంగీత సుభాష్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసంగీత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో సన్నాహక సభలో మాట్లాడారు. ఈ కార్యమంలో ఉప సర్పంచ్ యనమదల రాణి శ్రీనివాస్, సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, నామాల సుబ్బారావు, ఎంపిటిసి పెద్దిరెడ్డి పట్టాభి, సలాది జయప్రకాష్, తోట వెంకటేశ్వర్లు, సిరిగినీడి పట్టాభి, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట కొర్లపాటి వారిపాలెం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సభలో పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, వాసంశెట్టి కుమార్, సుంకర బాలాజీ, కొర్లపాటి గోపి, నీటి సంఘం అధ్యక్షుడు అక్కిశెట్టి దుర్గాప్రసాద్, మద్దింశెట్టి దొరబాబు, వాకపల్లి దొరబాబు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి డిల్లీ, ఎం.తాతాజీ పాల్గొన్నారు.

అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యనారాయణ

అల్లవరం బోడసకుర్రు రామాలయం వద్ద రోళ్ల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. మేకల ఈశ్వరరావు, పొట్టుపోతు దుర్గారావు, రొక్కాల నాగేశ్వరరావు, అడపా సాయిబాబు, గంట్రోతు రాజు, ఈతకోట వెంకట రమణ, పినిశెట్టి రామకృష్ణ, ముత్యాల అజయ్ రామారావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 56/2024

Between:
Patnala Neela @ Neelima, D/o. Patnala Peddiraju, aged about 48 years, Occ: Private Employee, R/o. Narayani Sai Home, Tellapur, Sangareddy District, Telangana. ...*Plaintiff*
AND
Mogalapu Sudarshan Wellington and Others ...*Defendants*
D-2: Mogalapu George Mithilesh, S/o. Mogalapu Sudarshan Wellington, aged about 44 years, Occ: Private, R/o. H.No. 56-11-8, Vidyanagar, Rajahmundry, Andhra Pradesh.
...*2nd Defendant*

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి THARUN PAL BATTHULA
11-3-2025 అడ్వకేట్, హైదరాబాద్

జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పిఠాపురం

ఈనెల 14న చిత్రాడ గ్రామంలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి చేసామని ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ తెలిపారు. మంగళవారం కుమారపురం గ్రామంలోని గోకుల్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14వ ఆవిర్భావ దినోత్సవ సభ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఆవిర్భావ సభకు దేశ నలుమూల నుంచి రానున్న జనసైనికుల కోసం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు.

KAKINADA URBAN DEVELOPMENT AUTHORITY

Short 'e' Procurement Notice

Notice No. KAUDA/ENG/2024-25/03 **dated: 10-03-2025**

Online Short tender is invited through e-procurement platform for 01 work of value Rs. 40.00 Lakhs of annual Maintenance of Beach and beach park at Kakinada. Bid document is available at www.eprocurement.gov.in from 12-03-2025, 10.00 AM. Cell: 62811 58881.

Sd/- Vice Chairman
KAUDA, Kakinada

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పరీక్షల నేపథ్యంలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ ప్రభుత్వాన్ని కోరిందని జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ తెలిపారు. పాఠశాలల్లో పది గ్రాండ్ టెస్ట్, పబ్లిక్ పరీక్షల సన్నద్ధత, సరస్వతి పూజలు తదితర బిజీ పరిస్థితుల్లో మార్చి 12 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడం తగదని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వానికి తెలిపారన్నారు. ముస్లిం ఉపాధ్యాయులు రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనలో ఉన్నారన్నారు. ఆయా క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం దూర ప్రాంతాల్లోని స్కూళ్లలో ఛీఫ్, డిపార్మెంటల్ అధికారులుగా నియామకమై వారి పనుల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. కొన్ని క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలల్లో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు 12 వరకు పాఠశాల నిర్వహించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, మధ్యాహ్నం ఒంటిగంటకు ఇతర గ్రామాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లకు వెళ్లి పాల్గొనే అవకాశం లేదన్నారు. విద్యాశాఖ హడావుడి నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వెంటనే ఈ సమావేశాలను రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్, సెక్రటరీలను కోరినట్టు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

సురక్షితమైన కృత్రిమ మేధో వ్యవస్థలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ సూచించారు. మంగళవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన, సురక్షితమైన ఎఐ వ్యవస్థలపై దృష్టి సారించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో అనేక ప్రామాణికత మరియు సాంకేతికలో కృత్రిమ మేధోపరమైన చౌరవ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్‌రెడ్డి, పి.శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం సరికాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలోని విద్య ప్రమాణాల వృద్ధి ముఖ్యమన్నారు. ఈ ప్రక్రియ గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమేనని అన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, వెలగతోడు

టెండరు నోటీసు

రిక.నెం. 11/2025 తేది.10-03-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలంలోని వెలగతోడు గ్రామపంచాయతీనకు 2025-26 సం॥నకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 15-03-2025 సం॥రం తేదీ శనివారం మధ్యాహ్నం గం॥ 12.00 వరకు వెలగతోడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.00 లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షములో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర వివరములు కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరింపబడవు.

వ.నెం.	అయిటము వివరము	టెండరు ధరావత్తు
1	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మొ॥లగు ప్రజారోగ్య సామాన్లు సప్లయి చేయుటకు	రూ.100/-
2	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన చేతి పైపు మరియు కుళాయి విడిభాగములు సప్లయి చేయుటకు	రూ.100/-
3	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ విడిభాగములు మరియు ఫిటింగ్స్ సప్లయి చేయుటకు	రూ.100/-
4	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి అవసరమైన పారిశుద్ధ్య పనులు చేయుటకు ఆరుగురు (6) వ్యక్తులు	రూ.100/-

యన్.కృపరాజు, సర్పంచ్
గ్రామపంచాయితీ, వెలగతోడు

సం/- వి.వి.ఆర్.కె.రాజు, పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, వెలగతోడు, మండపేట మండలం